రైతుల ఎదురుచూపులు

- గ్రావిటీ ద్వారా హైలెవల్ స్లూయిజ్‌కు అందని నీరు
- ఖరీఫ్ పంటలకు నీటి విడుదల కష్టమే
- లిఫ్ట్ పద్ధతిలో విడుదల చేయాలి
- అయితే ఇన్‌ఫ్లో లేని కండలేరు జలాశయం
- ప్రస్తుత నీటిమట్టం 26 టీఎంసీలు


కండలేరు జలాశయం

పొదలకూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో 12,231 క్యూసెక్కులు ఉంది. ఖరీఫ్ సీజన్‌లో వరదనీరు వచ్చి ప్రాజెక్ట్‌లో నీటి మట్టం పెరుగుతోంది. ఇక సోమశిల నుంచి కండలేరుకు నీరు విడుదల చేయడం ఆలస్యమైనా ప్రస్తుతానికి జలాశయంలో 26.61 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 31 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సోమశిలకు నీటి ప్రవాహం పెరిగే అవకాశం కూడా ఉంది.

కండలేరు ఆధారంగా..

ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, మనుబోలు మండలాల్లో కండలేరు నీటిని ఆధారం చేసుకుని ఖరీఫ్ పంటల సాగవుతున్నాయి. ఆయా మండలాల్లోని కొన్ని గ్రామాల్లో కండలేరు ఏటికాలువకు ప్రాజెక్ట్ లోలెవల్ స్లూయిజ్ ద్వారా నిరంతరాయంగా స్వల్పంగానైనా సాగునీటిని విడుదల చేస్తుంటారు. రాపూరు మండలం సంక్రాంతిపల్లి పికప్ ఆనకట్ట నుంచి పిన్నేరువాగు ద్వారా మనుబోలు మండలంలోని మరికొన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుంది. ఈ నేపథ్యంలో పొదలకూరు మండలంలో మెట్టపంటలతోపాటు ఖరీఫ్ ఎడగారు వరిసాగుకు నీరందడం లేదు.

35 టీఎంసీలు ఉంటేనే..

కండలేరు ఎడమ కాలువ మెట్టరైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ కాలువకు 300 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కాలువ వెంబడి చాలామంది రైతులు ఖరీఫ్ కింద పంటల సాగు చేస్తున్నారు. అయితే కాలువకు గ్రావిటీ వాటర్ నిలిచిపోయింది. కండలేరు జలాశయంలో 35 టీఎంసీల నీటి నిల్వ ఉంటేనే హైలెవల్ స్లూయిజ్ ద్వారా గ్రావిటీ నీరందుతుంది. అయితే ప్రాజెక్ట్‌లో నేడు 26 టీఎంసీలు నీటి నిల్వ మాత్రమే ఉంది. ఫలితంగా ఎడమగట్టు కాలువకు నీరందడం లేదు. దీంతో కాలువ వెంబడి ఉన్న నిమ్మ, మామిడి, జామ, సవక, జమాయిల్ తోటలకు నీరందక ఇబ్బందిగా మారింది. అంతేకాక రైతులు ఎడగారు కింద వరిసాగు కూడా చేస్తున్నారు. కాలువకు నీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లిఫ్ట్ ద్వారా అవకాశం

గ్రావిటీ నీరు స్లూయిస్‌కు అందకుంటే ఎడమ కాలువకు లిఫ్ట్ పద్ధతిలో నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో లోలెవల్ స్లూయిజ్ ద్వారా లిఫ్ట్ పద్ధతిలో కాలువకు నీటిని విడుదల చేయాల్సిందిగా రైతులు విజ్ఞప్తి చేశారు. అయితే లిఫ్ట్ మోటార్లకు విద్యుత్‌ను అందించే ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తి అధికారులు రిపేర్లు చేయిస్తున్నారు. సరఫరాను పునరుద్ధరించిన తర్వాత కాలువకు నీటిని పంపింగ్ ద్వారా విడుదల చేయాలనే ఆలోచన ఉన్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియకు ఎన్నిరోజులు పడుతుందో తెలియాల్సి ఉంది. త్వరగా మరమ్మతులు పూర్తయితే రెండు, మూడు రోజుల్లో నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా కాలువకు నీటిని విడుదల చేస్తే పొదలకూరు మండలంతోపాటు చేజర్ల మండలంలోని గాలిపాళెం, ఏటూరు, ఏటూరుకండ్రిక గ్రామాల రైతులకు సైతం మెట్టపంటల సాగునీటి అవసరాలు తీరుతాయంటున్నారు.


కండలేరు ఎడమకాలువ (ఫైల్)


లిఫ్ట్ ఇరిగేషన్ హెవీ విద్యుత్ మోటార్లు

వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీస్ ఆంక్షలు

- జనసమీకరణ జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు

పొదలకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం జిల్లా పర్యటన సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు ఆంక్షలు విధిస్తూ బుధవారం నోటీసులను జారీ చేశారు. ప్రధానంగా పొదలకూరు మండలంలో గ్రామ స్థాయి నాయకుల వద్దకు పోలీస్ సిబ్బంది వెళ్లి నోటీసులను అందజేశారు. అంతేకాక పొదలకూరు పట్టణంలో 30 యాక్ట్ అమలులో ఉందని, జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జనసమీకరణ చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ శివరామకృష్ణారెడ్డి ఎస్సై హనీఫ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వైఎస్సార్ సీపీ నాయకులు జనసమీకరణ జరపకూడదని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

➡ **మనుబోలు:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జన సమీకరణ, బస్సులు ఏర్పాటు చేయొద్దని పోలీసులు బుధవారం మనుబోలు మండల కేంద్రంలోని నాయకులకు నోటీసులు జారీ చేశారు. జన సమీకరణ చేసినా, జగన్‌ను కలిసేందుకు వెళ్లేవారికి వాహనాలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి, నాయకులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులకు నోటీసులిచ్చారు.

➡ ఆంక్షలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి అన్నారు. పోలీసుల నోటీసుల నేపథ్యంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా జనం స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. వారిని ఆపడం పోలీసుల తరం కాదన్నారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గిరి, కమలాకర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, సూరపనేని కిశోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభిమానులు, కార్యకర్తలు రాకుండా..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరులో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ అభిమానులు, కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ముంబై రోడ్డు, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం వద్ద బుధవారమే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు కాపలా కాస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నెల్లూరు వెళ్లకుండా చేస్తున్నారు. క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడికి వెళ్తున్నారు, ఎటువైపు వెళ్తున్నారంటూ బైక్, కారు తదితర వాహనాలను నిలిపి ఆరాతీస్తున్నారు. అభిమానులు మాత్రం తాము ఎలాగైనా జగనన్నను చూసేందుకు వెళ్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

➡ **కోవూరు:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా కోవూరు నుంచి పార్టీ నేతలు, అభిమానులు రాకుండా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. నెల్లూరు వెళ్లే మార్గాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ క్రమంలో కోవూరు మండలంలోని ప్రధాన రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

➡ **వెంకటాచలం:** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లకూడదని పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. మండలంలోని మండల స్థాయి నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు అందజేశారు.


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ కామాక్షితాయి ఆలయ మార్గంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్


మనుబోలు: హరగోపాల్‌రెడ్డికి నోటీస్ ఇచ్చిన పోలీస్


మనుబోలు : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కోవూరులో జాకీర్‌సా మిల్లు వద్ద ఉన్న పోలీసులు

క్లుప్తంగా

ప్రసన్న ఆశీర్వాదం



కోవూరు: కోవూరు మండలం గంగవరం సర్పంచ్ ఏడెం లక్ష్మీకుమారి కుమార్తె వివాహం నెల్లూరులోని సీపీఆర్ కల్యాణ మండలంలో బుధవారం జరిగింది. ఈ క్రమంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి–గీతారెడ్డి దంపతులు పాల్గొని, వధూవరులు హరిచందన- పవన్‌కల్యాణ్‌రెడ్డిలను ఆశీర్వదించారు.

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 2న ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో కో–చైర్మన్ ప్రసాద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వీవీ శేషు తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని మున్సిపల్ పాఠశాలలో జిల్లా సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి సీనియారిటీ ద్వారనే ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు హజరత్, కృష్ణారెడ్డి, నరసింహ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేంద్రకు అశ్రునివాళి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రి అభివృద్ధిలో జనరల్ మెడిసిన్ విభాగ హెచ్‌ఓడీగా కీలకపాత్ర పోషించిన డాక్టర్ నరేంద్ర లేనిలోటు తీర్చలేనిదని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా అన్నారు. రెండు రోజుల క్రితం డాక్టర్ నరేంద్ర గుండెపోటుతో మృతిచెందగా, ఆయన సంతాప సభను నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు డాక్టర్లు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల సాధనలో, వైద్య విద్యార్థుల నూరు శాతం ఫలితాల్లో ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, డాక్టర్లు శోభారాణి, గంగాధర్‌లతో పాటు ఏడీ ఏడుకొండలు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(పొగతోట): పొదలకూరు సర్పంచ్ ఎం.చిట్టెమ్మ, వెంకటాచలం సర్పంచ్ రాజేశ్వరిలకు నిధుల దుర్వినియోగంపై షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసులు అందిన వారం రోజుల్లోగా సమాచారం అందజేయాలని తెలిపారు.

ఇస్కపాళెంలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవడానికి అధిక కాలం పడుతుందన్నారు. ఇంకా శ్రమ, ఖర్చుతో కూడిన వ్యవహారమన్నారు. దీంతో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలను అందించేందుకు ఈ చట్టం తీసుకొచ్చారన్నారు. సమస్యలను న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తెస్తే ఉచితంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ప్రైవేట్ భవనంలోకి హాస్టల్

సాక్షి ఎఫెక్ట్..

మనుబోలు: శిథిలావస్థకు చేరుకున్న మనుబోలులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని త్వరలోనే ప్రైవేట్ భవనంలోకి మారుస్తామని ఏఎస్‌డబ్ల్యూఓ సుధారాణి తెలిపారు. మనుబోలులోని ఎస్సీ బాలుర వసతి గృహం దుస్థితిపై సోమవారం సాక్షిలో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. బుధవారం మనుబోలులోని ఓ ప్రైవేట్ భవనాన్ని హాస్టల్ కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహం దాదాపుగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ విద్యార్థులు ఉండటం కష్టంగా మారిందన్నారు. హాస్టల్ కోసం కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈలోపు ప్రైవేట్ భవనంలోకి హాస్టల్‌ను మారుస్తామని తెలిపారు. ఆమె వెంట హాస్టల్ మేట్రిన్ అనిత ఉన్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న సుధామణి

ప్రతిభావంతులకు అభినందన



కొడవలూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో నార్తురాజుపాళెం హైస్కూల్‌లో బుధవారం అభినందన సభ నిర్వహించారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో పదిలో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులకు మెడల్, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యూటీఎఫ్ అభినందన సభ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆ సంఘ మండల కార్యదర్శి పి.తిరుపాలు ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు ఎ.పుట్టయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు డి.ఓబులేసు, సత్యనారాయణ, మోహన రామలింగయ్య, లక్ష్మీకాంతం, సంఘ నేతలు ఖాజావలీ, శైలజ, జమీర్ అహ్మద్, కీర్తన, గౌస్‌బాషా, నాగభూషణం, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలానికి చెందిన వేదగిరి ప్రకాష్ (61) రెండు రోజుల క్రితం తన మోటార్‌బైక్‌పై క్యూబా ఇంజినీరింగ్ కళాశాల వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టి పరారయ్యాడు. తీవ్రగాయాలతో పడి ఉన్న ప్రకాష్ గురించి స్థానికులు అతని భార్య లక్ష్మీప్రసన్నకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఎస్వీఆర్‌ఆర్ జీజీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పొదలకూరు: రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను మండల కేంద్రమైన పొదలకూరు రైతు సేవా కేంద్రం – 3లో అందజేస్తున్నట్టు ఏఓ ప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగలు 10 కేజీలు రూ.1,230, పిల్లిపెసర రూ.1,440, జనుము రూ.1,090 ధరలకు 50 శాతం రాయితీపై ఇస్తామన్నారు. అవసరమైన రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలను అందజేసి విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు.

2న మహిళా క్రికెట్ జట్టు ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 2న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని క్రికెట్ ప్రాంగణంలో మహిళల అండర్–23 సీనియర్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్టు, వైట్ డ్రెస్ కోడ్‌తో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు క్రికెట్ ప్రాంగణంలో సంప్రదించాలని తెలిపారు.

కాంట్రాక్ట్ సిబ్బందితో పంచాయతీల్లో పనులు

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని పంచాయతీల్లో తాగునీటి సరఫరా, విద్యుద్దీపాలు తదితర అవసరాల నిమిత్తం కాంట్రాక్టు ఉద్యోగులను నియమించేందుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి అవసరమైన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందికి వేతన చెల్లింపులు తదితర వాటిపై తప్పనిసరిగా ఆడిట్ నివేదికలు సమర్పించాలన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కొడవలూరు: వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి పి.వెంకట్రావు సూచించారు. మండలంలోని రేగడిచెలిక, కమ్మపాళెంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల సాగు ఖర్చులు గణనీయంగా పెరగడంతో పాటు దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడడం పంటకు శ్రేయస్కరమన్నారు. వసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ నిహారిక, రైతులు పాల్గొన్నారు.


కొడవలూరు: రేగడిచెలికలో..

మాకు తెలియకుండానే అనుమతులా..?

- కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అసహనం

నెల్లూరు(బారకాసు): మాకు తెలియకుండానే ముందస్తు అనుమతులా.. అజెండాలోని అంశాలను ముందుగానే ఆమోదం చేశారా.. వర్కులు, పేమెంట్ జరిగిపోయాక మాతో పనేంటి.. కౌన్సిల్ సమావేశం ఎందుకు? అని కూటమి కార్పొరేటర్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 111 మెయిన్ అజెండా, 6 సప్లిమెంటరీ అజెండా, 15 టేబుల్ అజెండాలుగా మొత్తం ప్రవేశపెట్టిన 132 తీర్మానాలను ఆమోదించారు. తొలుత డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులకు తెలియకుండానే అజెండాలోని 132 అంశాలను ముందస్తు అనుమతి కోసమంటూ సమావేశం నిర్వహించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. చర్చ లేకుండా ఆమోదం ఏమిటన్నారు. తర్వాత చేజర్ల మహేష్, కిన్నెర మాల్యాద్రి, గోతం అరుణ, తాళ్లూరు అవినాష్, తదితర కూటమి కార్పొరేటర్లు కౌన్సిల్ సాక్షిగా ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. స్థానిక సమస్యలపై గతంలో తెలియజేసినప్పటికీ నేటికీ పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తమను నిలదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

➡ కాగా కో–ఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ కాలువల్లోని సిల్ట్‌ను పెన్నానదిలో వేస్తున్నారని, దీనిపై సదరు వ్యక్తులను అడిగితే గాంధీబొమ్మ ప్రాంత కార్పొరేటర్ చెబితేనే చేస్తున్నామనే సమాధానం వస్తోందన్నారు. దీంతో సంబంధిత కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్ల కో–ఆప్షన్ సభ్యుడిగా పదవి పొంది ఇప్పుడు మా మీదనే నిందలు వేయడం విడ్డూరమన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తన డివిజన్ పరిధిలో చిన్నచిన్న సమస్యలను ఇటీవల మేయర్ పర్యటనకు వచ్చిన సమయంలో తెలియజేశామని, అయితే ఇప్పటివరకు ఏవీ పరిష్కారం కాలేదన్నారు. రూ.కోట్లు విలువ చేసే పనులు మాత్రం చేస్తున్నారని తాను అడిగిన చిన్న చిన్న పనులు మాత్రం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ స్రవంతి మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సుమారు రూ.43 కోట్లకు సంబంధించిన అజెండా అంశాలను నగరపాలక సంస్థ బడ్జెట్లో కేటాయించామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు వేగంగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ నందన్‌తో పాటు ఎస్‌ఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ స్రవంతి


సమావేశంలో కో–ఆప్షన్ సభ్యుడిని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మహేష్

యాప్‌లపై అవగాహన అవసరం

నెల్లూరు(పొగతోట): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులకు సంబంధించి నూతన యాప్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని డ్వామా పీడీ గంగా భవాని ఈసీలు, టీఏలను ఆదేశించారు. నగరంలోని డ్వామా క్లస్టర్ కార్యాలయంలో నూతన యాప్‌లపై ఈసీలు, టీఏలకు బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి జరుగుతున్న పనులు, పని ప్రదేశాలు, పూర్తి వివరాలను నూతన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కూలీలకు సంబంధించి ఆధార్ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. పని ప్రదేశంలో రెండు ఫొటోలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన యాప్‌లను క్షేత్రస్థాయిలో ఎఫ్‌ఏలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీలు శంకర నారాయణ, మృదుల, వివిధ మండలాల ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.